సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 15 । మే । 2023



...'ప్రజలే' స్పందించారు

స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నాయని విన్నవించినా అధికారులు స్పందించకపోవడంతో ప్రయాణికులే రంగులు వేశారు. 8లో



.... రైతులు ఉక్కిరిబిక్కిరి

ప్రస్తుత యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు, ఈదురుగాలులతో జిల్లాలోని మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ముగిసిన ఎంసెట్



విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఎంసెట్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. 10,11 తేదీల్లో మెడికల్, అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్షలు జరపగా, 12,13,14 తేదీల్లో ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు ఉదయం జరిగిన పరీక్షకు 125 మంది హాజరుకావాల్సి ఉండగా 121 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 125 మందికి గాను 122 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజావాణి

కొత్తగూడెంటౌన్: పాల్వంచలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులందరు హాజరుకావాలని డీఆర్‌ఓ అశోక చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నిమిషాలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు.

వేసవి దుక్కులకు సిద్ధం..



పూజ కోసం రామాలయం వద్ద బారులుదీరిన ట్రాక్టర్లు

ఇల్లెందురూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు నేలలో పదును ఉండటంతో రైతులు వేసవి దుక్కులకు సిద్ధమవుతున్నారు. ఆదివారం తెల్లవారుజామునే ట్రాక్టర్లతో ఆలయాల వద్ద కు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేలల్లోకి చేరి దుక్కి పనులు చేపట్టారు. మండలంలోని మొండితోగు గ్రామపంచా యతీ రామాలయం వద్ద పూజకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు చేరుకోవడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. కాగా గతంలో నాగళ్లు, గొర్రుతో దుక్కి చేసే రైతులు వ్యవసాయ యాంత్రీకరణతో ట్రాక్టర్లతో దుక్కులు చేస్తున్నారు.

'నడి సంద్రాన నావ పోతున్నది' సీడీ ఆవిష్కరణ




మాట్లాడుతున్న వద్దనపు వాసు

ఖమ్మం అర్బన్: నగరంలోని బల్లేపల్లికి చెందిన సినీ సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'నడి సంద్రాన నావ పోతున్నది' పాట సీడీని నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో ఆదివారం జరిగిన ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం డైరెక్టర్, కళాశాల పూర్వ విద్యార్థి వద్దనపు వాసు మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత కలసిన మిత్రుల సమక్షంలో ఈ పాట విడుదల కావటం అభినందనీయమన్నారు. ఆ కళాశాలలో చదివిన అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. సినీ సంగీత దర్శకుడు మోహన్‌తో పాటు నాక్ తొలి డైరెక్టర్ ప్రసాద్, రాజ్యసభ సభ్యుడు పార్థసారధిరెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు వంటి వారు ఈ కళాశాల విద్యార్థులేనని గుర్తు చేశారు. అనంతరం మోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు లింగాల కమల్‌రాజ్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీహరి, బాబా, విజయరావు పాల్గొన్నారు.

మామూళ్లపైనే ధ్యాస!



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం



అవినీతికి చిరునామాగా వాణిజ్య పన్నుల శాఖ

- జీఎస్టీ వసూలు కంటే ముడుపులపైనే దృష్టి
- తనిఖీల పేరుతో వ్యాపారులకు బెదిరింపులు
- అక్రమ సొమ్ము పంపకాల్లో అభిప్రాయభేదాలు
- రెండు వర్గాలుగా విడిపోయి ఆఫీస్‌లో వాటాల కోసం వాగ్వాదం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వాణిజ్య పన్నుల శాఖ జిల్లా కార్యాలయం అట్టుడుకుతోంది. పన్నుల రూపంలో కాకుండా బల్ల కింద చేయి పెడితే వచ్చే ఆదాయం, దాని పంపకాల విషయంలో అభిప్రాయబేధాలు వచ్చి ఇక్కడి ఉద్యోగులు రెండు వర్గాలుగా విడిపోయినట్టు తెలుస్తోంది. ఇరు వర్గాలకు సర్ది చెప్ప లేక జిల్లా వాణిజ్య పన్నుల అధికారి లాంగ్ లీవ్ పెట్టేందుకు సైతం వెనుకాడటం లేదంటున్నారు.

జీఎస్టీ వసూలుకు రెండు విభాగాలు

కిరాణా దుకాణం మొదలు మల్టీప్లెక్స్ వరకు ఎవరు ఏ రకమైన వ్యాపారం చేసినా ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలి. ఈ మేరకు గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్టీ) చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. నిత్యం వాడుకలో ఉండే వస్తువులు, సేవలను పలు కేటరిగీలుగా విభజించింది. కేటగిరీల వారీగా పన్నులు నిర్ణయించింది. ఈ పన్నులు వసూలు చేస్తూ ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చూడటం వాణిజ్య పన్నుల శాఖ కార్యాయలం, అక్కడ పని చేసే సిబ్బంది ప్రధాన విధి. జిల్లా విస్తీర్ణం అధికంగా ఉండటం, పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ అనేక కేటరిగీల కింద వ్యాపారం, సేవలు కొనసాగుతున్నాయి. దీంతో వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో జీఎస్టీ వసూలు చేసేందుకు రెండు విభాగాలు పని చేస్తున్నాయి

వాటాల్లో తేడాలు

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల సంగతి పక్కన పెడితే కొంత కాలంగా మామూళ్ల పంపిణీ విషయంలో వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో ఉన్న రెండు విభాగాల మధ్య బేధాభిప్రాయాలు పొడసూపాయి. మామూళ్ల విషయంలో ఒక టీమ్ బాగా లాభపడుతుంటే మరో టీం ఆ స్థాయిలో ఆర్జించలేకపోతోందనే వాదన మొదలైంది. ఇదే సమయంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పని చేస్తూ 'మామూళ్లు' ఎవరికి ఎంత అనే విషయంలో కీలకంగా వ్యవహరించే క్లర్కు స్థాయి ఉద్యోగి.. వసూలు చేసుకునే దమ్మును బట్టి జేబులు నిండుతాయంటూ బాహాటంగా వ్యాఖ్యలు చేశాడు. దీంతో క్షేత్ర స్థాయి తనిఖీల్లో కొందరు సిబ్బంది శృతి మించినట్టుగా ప్రవర్తించడంతో దాడులకు సైతం కొందరు వ్యాపారులు వెనుకాడలేదని తెలుస్తోంది.

ఇరువర్గాల మధ్య వాగ్వాదం!

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్న క్లర్కు తన వర్గానికే మేలు చేసేలా టీమ్‌లు ఏర్పాటులో కీలక భూమిక పోషించడమే కాకుండా వారి టీం పరిధిలోకి వచ్చేలా 'లాభసాటి అంశాలు' ఉంచినట్టు మరో వర్గం అనుమానిస్తోంది. పైగా తమను బద్నాం చేసేందుకే మామూళ్లు రాని అంశాలను కేటాయించి, వసూళ్ల చేతగాని వారీగా ముద్ర వేశారంటూ రగిలిపోతున్నారు. దీంతో ఈ అంశాలపై గత వారం కార్యాలయంలో జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి సమక్షంలోనే ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలుస్తోంది. జిల్లా వాణిజ్య పన్నుల అధికారి ఇద్దరికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఎవరూ వెనక్కి తగ్గలేదని తెలుస్తోంది.

ఉన్నతాధికారి ఉదాసీనత...

పన్నులకు సంబంధించిన వ్యవహారం కావడంతో తనిఖీల పేరుతో వాణిజ్య పన్నుల సిబ్బంది చేపడుతున్న బెదిరింపులపై ఎవరూ ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడం లేదు. ఇదే సమయంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది మామూళ్ల కోసం ఫైటింగ్‌కు దిగుతుంటే వారిపై చర్యలకు ఉపక్రమించాల్సిన ఉన్నతాధికారి చర్చల పేరుతో అసలు తప్పేం జరగలేదన్నట్టుగా ఉండటమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాణిజ్య పన్నుల శాఖ జిల్లా కార్యాలయంలో పాలన గాడితప్పిందనడానికి అక్కడ జరుగుతున్న అంతర్యుద్ధాలు ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ అందుకు తగ్గట్టుగా ఖజానా నింపాల్సింది పోయి తమ బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకోవడంపైనే ఇక్కడి సిబ్బంది దృష్టి ఉందనే విమర్శలు వస్తున్నాయి.

చూసీచూడనట్లుగా..

వ్యాపార వాణిజ్యం చేసేవారు, వివిధ సేవల్లో ఉన్న వారు ఎప్పటికప్పుడు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పన్నులు చెల్లించాలి. వారు ఆ విధంగా చేస్తున్నారో లేదో పర్యవేక్షించడం, అవసరాన్ని బట్టీ రికార్డులు తనిఖీ చేయడం వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది చేపడుతుంటారు. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం చివర్లో ఈ తరహా తనిఖీలు ఎక్కువగా ఉంటాయి. వ్యాపారంలో అధిక లాభాలు దక్కించుకునేందుకు కొందరు వ్యాపారులు జీఎస్టీ పరిధిలోని వివిధ వస్తువులు, సేవలను ఎక్కువ పన్ను నుంచి తక్కువ పన్ను పరిధిలో చూపించడం, అసలు లెక్కల్లోనే చూపించకపోవడం తదితర పనులు చేస్తుంటారు. మరికొందరు కొన్ని సేవలు, వస్తువులకే అనుమతులు తీసుకుని ఎక్కువ మొత్తంలో వ్యాపారం చేస్తుంటారు. ఇక కొందరైతే జీఎస్టీతో సంబంధం లేకుండానే మార్కెట్‌లో చలామణీ అవుతుంటారు. దీంతో తమ లొసుగులు చూసీచూడకుండా వదిలేసేందుకు వాణిజ్య పన్నుల అధికారులు, సిబ్బంది మామూళ్లు అందుతుంటాయి.

దుష్ప్రచారం చేస్తున్నారు

కార్యాలయంలో పని చేసే కొందరు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వాడుకలోకి తెస్తున్నారు. బయట జరుగుతున్న ప్రచారంతో ఆఫీసుకు ఎలాంటి సంబంధం లేదు. నిక్కచ్చిగా నిజాయితీతో ఇక్కడి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

– విశ్వ కిరణ్, జిల్లా వాణిజ్య పన్నుల అధికారి

భానుడి భగభగ..

- రోహిణి కార్తెకు ముందే మండుతున్న ఎండలు
- రెండో రోజులుగా 44 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు
- వడగాలులతో అల్లాడిపోతున్న ప్రజలు



ఎండ నుంచి రక్షణకు గొడుగుతో వెళ్తున్న వ్యక్తి

చుంచుపల్లి: సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం 10 గంటలకే 35 డిగ్రీలు, మధ్యాహ్నం 12 గంటలకు 40 డిగ్రీలకు చేరువలో, ఇక మధ్యాహ్నం 2 గంటలు దాటితే 44 డిగ్రీలకు మించి జిల్లాలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వాతావరణం చల్లబడగా ప్రజలు ఒకింత ఊపిరిపీల్చుకున్నారు. మళ్లీ నాలుగైదు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వడగాలులు దడ పుట్టిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. జిల్లాలో శనివారం 44.5, ఆదివారం 44.2 డిగ్రీల గరిష్ట పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలు. జిల్లా వ్యాప్తంగా భద్రాచలం, మణుగూరు, ఇల్లెందుతోపాటు మరికొన్ని చోట్ల 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత నెలలో ఒకసారి గరిష్టంగా పాల్వంచ యానంబైలులో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజంతా ఎండ వేడిమి, వడగాలులతో జనం విలవిల్లాడిపోతున్నారు. వాహనాలపై వెళ్లే ఉద్యోగులు, యువకులు, మహిళలు, వృద్ధులు భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక టోపీలు, చేతి రుమాళ్లు, గొడుగులు వంటివి రక్షణ కవచాలను ధరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అర్ధరాత్రి వరకూ వేడిమి తగ్గడం లేదు.

తేదీ	ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీలు)
09	దమ్మపేట	41.7
10	జూలూరుపాడు	42.5
11	కొత్తగూడెం	43.4
12	జూలూరుపాడు	41.7
13	కొత్తగూడెం	44.5
14	లక్ష్మీదేవిపల్లి	44.2

రోహిణి కార్తెలో ఎలా ఉంటాయో..

రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయనే నానుడి ఉంది. రోహిణి కార్తె ఈ నెల 25 నుంచి ప్రారంభంకానుండగా, ఎండలు మాత్రం ఇప్పటి నుంచే మండిపోతున్నాయి. ఇక రోహిణి కార్తెలో ఎండలు ఎంత తీవ్రంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సైతం 48, 49 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతోపాటు వడగాడ్పులతో కూలీలు, చిరు వ్యాపారులు భయపడుతున్నారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాల షాపులను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరిబొండాలు, పండ్ల, చెరుకు రసాలు, ఐస్‌క్రీమ్ షాపులకు గిరాకీ పెరిగింది.

మాతృమూర్తిని సన్మానించిన డీహెచ్



తన తల్లిని శాలువాతో సన్మానిస్తున్న హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: మదర్స్ డే సందర్భంగా రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తన మాతృమూర్తి సత్యవతిని శాలువాతో సన్మానించారు. పాదాభివందనం చేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీలో జనహిత ప్రాంగణంలో ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మే సృష్టికి మూలమని, కుటుంబాన్ని పోషించేందుకు అమ్మ ఎన్నో కష్టాలు పడుతుందని పేర్కొన్నారు.

పలువురికి పరామర్శ

సుజాతనగర్: సీతంపేట బంజర, సింగభూపాలెం గ్రామాల్లో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదివారం పలు కుటుంబాలను పరామర్శించారు. సీతంపేట బంజరలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం సుజాతనగర్‌కు చెందిన ఓ విలేకరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జీఎస్‌ఆర్ ట్రస్టు సభ్యులు చంద్రగిరి అంజి, జోగారావు, ప్రభాకర్, బోడ హరి, కిరణ్, శ్రీనివాస్, డాక్టర్ పోటు వినోద్, గడల భాస్కర్, జీవీఆర్ ప్రసాద్, గడల నర్సింహారావు, శ్యామ్, వినోద్, వంశీ, వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంటౌన్: మండల స్థాయిలో సోమవారం నుంచి నిర్వహించనున్న సీఎం కప్ పోటీలను జయప్రదం చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం కప్ పోటీల నిర్వహణపై క్రీడలు, రెవెన్యూ, డీఆర్‌డీఓ, డీపీఓ, జెడ్పీ సీఈఓ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండలస్థాయి, 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోటీల్లో 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మండలస్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీల నిర్వహణ కమిటీకి ఎంపీపీ చైర్మన్‌గా, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, గెజిటెడ్ హెచ్‌ఎం, ఎస్‌ఐ, పీఈటీలు సభ్యులుగా ఉంటారని వివరించారు. మండలస్థాయిలో గెలిచిన జట్లకు సర్టిఫికెట్లు ఇవ్వడంతోపాటు జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ తోపాటు మండలస్థాయిలో నిర్వహించే 5 రకాల పోటీలను కలుపుకుని 11 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లా స్థాయిలో కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎస్పీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కో–వైస్ చైర్మన్‌గా, డీవైఎస్‌ఓ కన్వీనర్‌గా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లేదా కార్యదర్శి డీఈఓ, పరిశ్రమల శాఖ జీఎం, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదు ఇస్తారని పేర్కొన్నారు. అదే జట్లయితే ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలతోపాటు సీఎం కప్‌ను అందిస్తారని వివరించారు. ఎండాకాలం వేడిని దృష్టిలో ఉంచుకుని మైదానాల్లో అత్యవసర మందులతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అధికారి సీతారాం, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఈఓ సోమశేఖరశర్మ, మున్సిపల్ కమిషనర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజా ప్రభుత్వమే కొంటుంది

- రైతులు ఆందోళన చెందొద్దు
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



అల్లీపురంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన డీసీసీబీ చైర్మన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అల్లీపురం, రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో ఆదివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కజొన్నను క్వింటాకు రూ.1962 చొప్పున పంట మొత్తం ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గతంలో పొలాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలి రైతులు అరిగోస పడ్డారని, నేడు వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో రైతు బంధు పథకం ద్వారా ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేస్తున్నామని, పోడుపట్టాలు ఉన్న వారికి కూడా ఈ సాయం అందిస్తున్నామని తెలిపారు. నేడు తెలంగాణ వ్యవసాయ హబ్‌గా నిలిచిందన్నారు. రైతులు పండించిన ధాన్యం కూడా ప్రభుత్వమే కొంటుందని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, తడిసిన ధాన్యం కూడా కొంటామని స్పష్టం చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఆంధ్రా బ్యాంక్ కర్షక సేవా సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఆర్‌డీఓ రవీంద్రనాథ్, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, డీసీఓ విజయకుమారి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ నర్సింహరావు, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు, సర్పంచ్ మెంటెం రామారావు, నాయకులు మద్దినేని వెంకటరమణ, కుర్రా భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

జై చిరంజీవా..



పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

- ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- భారీగా తరలివచ్చిన భక్తులతో సందడి
- భద్రాచలం రామాలయంలో లడ్డూల కొరత



భద్రాచలం: చిత్రకూట మండపంలో నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

భద్రాచలం: జై శ్రీరామ్..జై హనుమాన్ నామస్మరణలతో భద్రగిరి సందడిగా మారింది. ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి ఉపాలయంలో ఉదయం అభిషేకం, తమలపాకు అర్చన, సుందరకాండ పారాయణం జరిపారు. శ్రీసీతారామ చంద్రస్వామివారితో పాటు ఆంజనేయునికి తిరువీధి సేవ గావించారు. శనివారం నుంచే భక్తుల రద్దీ పెరగ్గా, రామయ్య దర్శనానికి విచ్చేసిన అంజన్న మాలధారులతో ఆదివారం భద్రాచలం సందడిగా మారింది. కాగా భక్తుల రద్దీ దృష్ట్యా స్వామి వారికి ఆర్జిత సేవలను రద్దు చేశారు. జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భక్తుల ఇక్కట్లు

ఊహించని రీతిలో భక్తుల రాక ఒక్కసారిగా పెరగటంతో ఆలయంలో ప్రసాదాల కౌంటర్ల వద్ద లడ్డూల కొరత ఏర్పడింది. భక్తుల రాక విషయంలో ఆలయ అధికారులు అంచనాలు తలకిందులయ్యాయి. శనివారం సాయంత్రం భక్తులకు అడిగినన్ని లడ్డూలు ఇచ్చారు. లడ్డూలు అయిపోవడంతో ఈఓ రమాదేవి స్వయంగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఉండి అదనపు సిబ్బందితో లడ్డూలను తయారు చేయించారు. అయినా భక్తులకు సరిపడా లడ్డూలను అందివ్వలేకపోయారు. దీంతో కౌంటర్ల వద్ద భక్తులు పడిగాపులు కాశారు. ఎండ, వడగాడ్పుల నడుమ వేచి ఉన్న భక్తులు అవస్థ పడ్డారు. చివరికి పులిహోర ప్రసాదంతో సరిపుచ్చుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా, తోపులాట జరగకుండా సీఆర్పీఎఫ్ పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షించారు.

వేడుకగా రామయ్య కల్యాణం

దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి నిత్యకల్యాణంలో 96 జంటలు పాల్గొన్నాయి.



దుమ్ముగూడెం: అంజన్నకు తమలపాకులతో అర్చన..



లడ్డూ ప్రసాదం కోసం కౌంటర్ల వద్ద భక్తుల పడిగాపులు

పెద్దమ్మతల్లి ఆలయంలో..

పాల్వంచరూరల్: హన్‌మాన్ జయంతి సందర్భంగా శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో అభయాంజనేయ స్వామికి అర్చకులు పంచామృతాభిషేకం జరిపారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు శ్రీకనకదుర్గ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు. పునుకుల గ్రామంలోని శ్రీశ్రీ అద్భుత అభయాంజనేయస్వామి ఆలయంలో హన్‌మాన్ జయంతి ఉత్సవాలను దేవస్థానం ప్రధాన ధర్మకర్త మందలపు నాగేశ్వర రావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో జరిపారు.

క్లుప్తంగా

తలసేమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాయకులు, ఫౌండేషన్ సభ్యులు

దమ్మపేట: తలసేమియా వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రీకే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని జయలక్ష్మి థియేటర్ నుంచి మందలపల్లి వరకు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తూ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేయాల్సిన అవశ్యకతను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారా యుగంధర్, మన్యం రమేశ్, కందుకూరి నాగార్జున, ఈశ్వరరావు, యార్లగడ్డ భాస్కరరావు, యార్లగడ్డ బాబు, అబ్దుల్ జిన్నా, నల్లగుల్ల సత్యనారాయణ, పలువురు యువకులు పాల్గొన్నారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

చర్ల: వేగంగా ప్రయాణిస్తున్న కారు టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. వరంగల్ జిల్లాలోని ఐనవోలుకు చెందిన ఆరుగురు హనుమాన్ భక్తులు దీక్ష విరమణ కోసం భద్రాచలం వచ్చి తిరుగు ప్రయాణంలో చర్ల మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ సందర్భంలో వారు ప్రయాణిస్తున్న కారు చర్లలోని పెట్రోల్‌బంక్ సమీపంలోకి రాగానే ముందు టైర్ పంక్చర్ అయి కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి కారుపై నిలువుగా పడటంతో కారు ముందు భాగం దెబ్బతిన్నది. ఇదే సమయంలో కారు రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న రెండు ద్విచక్రవాహనాలను కూడా ఢీకొట్టింది. అయిఏత, కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

లారీని ఢీకొన్న కారు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని నాయక్ రైస్ మిల్లు సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో లారీని కారు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు వైపు నుంచి కర్రల లోడుతో భద్రాచలం వెళ్తున్న లారీని కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారు, లారీ ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కారులో డ్రైవర్‌తో పాటు మరొకరు ఉండగా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్‌ఐ గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

తెలంగాణ ఉద్యమకారుడు నాగరాజు మృతి



నాగరాజు (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనాథరాజు నాగరాజు (44) ఆదివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అలుపెరగని పోరాటాలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో మండలంలో తెలంగాణ ఉద్యమాన్ని నాగరాజు న డిపించారు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగరాజు భౌతికాయాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమకారులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

ఇకనైనా పురోగతి ఉంటుందా?

సరిహద్దు ప్రాంతంలో నత్తనడకన పనులు

- ప్రతిపాదన దశలోనే రెండో పామాయిల్ ఫ్యాక్టరీ
- మంత్రులూ కాస్త దృష్టి సారించరూ
- నేడు ఇద్దరు మంత్రుల పర్యటన



ములకలపల్లి మండలం మూకమామిడి వద్ద పునాది దశలోనే ఉన్న ఏకలవ్య పాఠశాల భవనం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం అవుతుండగా, పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఏళ్లు దాటుతున్న కొన్ని పనులైతే పునాదుల్లోనే మూలుగుతుండగా, ఆయా శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనీసం పట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం అశ్వారావుపేటలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని ప్రధాన సమస్యలు, పెండింగ్ పనుల్లో పురోగతి ఉంటుందా? అని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

- నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ఉద్యాన పంటలకు కేరాఫ్. అత్యధికంగా పామాయిల్ తోటలు విస్తరించి ఉన్న నేపథ్యంలో రెండో పామాయిల్ ఫ్యాక్టరీని 60 టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సి ఉంది. దానికి అనుగుణంగానే ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ స్థానికంగా రెండో ఫ్యాక్టరీ నిర్మిస్తామని రెండేళ్ల కిందటే ప్రకటించింది. దాంట్లో భాగంగానే స్థానిక ఫ్యాక్టరీ వద్దే స్థలాన్ని సైతం సిద్ధం చేశారు. కానీ రెండేళ్లుగా రెండో ఫ్యాక్టరీ నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.
- నారంవారిగూడెం వద్దగల ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో డీఓ (డివిజనల్ అధికారి) పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఇన్‌చార్జ్ డీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటు మేనేజర్, అటు డీఓగా ఆయన ద్విపాత్ర పోషించాల్సి వస్తోంది. దీంతో పామాయిల్ రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- అశ్వారావుపేట మండలానికి ఉద్యాన శాఖ అధికారి లేకపోవడం విశేషం. రెండేళ్లుగా హెచ్‌ఓ పోస్టు ఖాళీగానే ఉంది. ఇక్కడ దమ్మపేట హెచ్‌ఓ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తక్షణమే ఈ పోస్టును భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన డబుల్ ఇళ్ల నిర్మాణంలో భాగంగా నియోజకవర్గానికి రెండు విడతల్లో మొత్తం 1,380 ఇళ్లను మంజూరు చేసింది. వాటి నిర్మాణాలకు దాదాపు రూ.74.55 కోట్ల నిధులు కేటాయించింది. మొదటి విడతలో 400 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేయగా, రెండో విడతలో 980 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 540 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించగా, మరో 257 ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మిగిలిన 183 ఇళ్లకు టెండర్లు పూర్తి కాలేదు. అశ్వారావుపేట, కేశప్పగూడెం, నారాయణపురం పంచాయతీల్లో 60 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఏడాది దాటుతున్నాయి. వాటికి లబ్ధిదారుల ఎంపిక కుడా పూర్తి కాగా, నేటికీ వారికి పంపిణీ చేయలేదు. దీంతో డబుల్ ఇళ్ల కోసం అర్హులైన నిరుపేదలు పడిగాపులు పడుతున్నారు.
- మండలంలోని గుమ్మడవల్లి–వడ్డెర రంగాపురం గ్రామాల మధ్యలోని పెదవాగుపై 2017 హైలెవల్ వంతెన నిర్మాణం మంజూరు కాగా, రూ.7.50 కోట్లతో నిర్మిస్తున్నారు. కానీ ఈ వంతెన నిర్మాణం నేటికి పూర్తి కాలేదు.
- అశ్వారావుపేటలో పోస్టుమార్టం నిర్వహించేందుకు పక్కా భవనం అందుబాటులో లేదు. దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డులోనే శవ పంచనామా చేయాల్సి వస్తోంది. పక్కా భవనాన్ని మంజూరు చేయాలని ఏళ్లుగా కోరుతున్నా పాలకులకు పట్టడం లేదు.
- జిల్లా విభజన తర్వాత అశ్వారావుపేట, దమ్మపేట మండలవాసులకు న్యాయ సేవలు దూర భారంగా మారాయి. దమ్మపేటలోనే కోర్టు ఏర్పాటు చేసేందుకు అధికారులు మూడు నెలల కిందట స్థానిక ఎస్సీ హాస్టల్ భవనాలను పరిశీలించి వెళ్లారు. ఆ తర్వాత స్థానికంగా కోర్టు ఏర్పాటు ఊసే లేదు. నిత్యం 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడేనికి వెళ్లాల్సి వస్తోంది.
- ములకలపల్లి మండలంలోని మూకమామిడి గ్రామంలో రెండేళ్ల కిందట మంజూరైన ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలు నేటికీ పునాది దశ దాటలేదు. తొలి విడతకు రూ.25 కోట్లతో టెండర్లు పిలవగా, ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. పనులు ప్రారంభించి వదిలేయగా, రూ.15 కోట్లతో రెండో విడత కింద రీటెండర్లు పిలిచారు. ఈ పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు.
- అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రానికి 2018లో పక్కా భవనాన్ని మంజూరు చేశారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికీ పనులు పూర్తి చేయలేదు. దాదాపు ఐదేళ్లుగా ఈ పనులు సాగుతూనే ఉండటం విశేషం.

చివరికి 'ప్రజలే' స్పందించారు

- ప్రాణం పోయినా మారని అధికారుల తీరు
- స్పీడ్ బ్రేకర్‌లకు ప్రయాణికులే పెయింటింగ్



ఇటీవల జరిగిన ప్రమాదంలో దెబ్బ తిన్న ద్విచక్రవాహనం (ఫైల్)



స్పీడ్ బ్రేకర్లకు పెయింట్ వేస్తున్న యువతి

భద్రాచలం: స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, అవి కనపడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులకు విన్నవించారు. స్పందించని పోలీసు సిబ్బంది.. నిర్లక్ష్యం, అలసత్వంతో పెడచెవిన పెట్టారు. దీంతో ఒక్క నిండు ప్రాణం యాక్సిడెంట్ రూపంలో గాల్లో కలిసింది. అనంతరం మరో ప్రమాదం తప్పింది. అయినప్పటికీ అధికారుల్లో మార్పు రాలేదు. దీంతో ప్రయాణికులే స్వయంగా స్పీడ్ బ్రేకర్‌లకు రంగులు వేసి తమలోని సేవా గుణాన్ని చాటుకున్నారు.

అమ్మ ప్రేమకు దూరం..

భద్రాచలంలోకి ప్రవేశించే మార్గంలో స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేశారు. వాటికి రంగులు వేయకపోవడంతో స్పీడ్‌గా వచ్చిన ద్విచక్రవాహనాలపై వెనుక కూర్చున్నవారు ఎగిరికింద పడుతున్నారు. రోజువారి విధుల్లో భాగంగా సారపాక నుంచి భద్రాచలం వచ్చే ఓ యువతి స్వయం అనుభవంతో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఈ ప్రమాదకర పరిస్థితిని వివరించింది. ప్రమాదకరంగా ఉందని, దీనికి పెయింటింగ్ వేయాలని సూచించింది. సరైన సమయంలో పోలీసు సిబ్బంది స్పందించకపోవడంతో ఆ యువతి సూచించిన వారం రోజుల్లోనే ఈ నెల 8వ తేదీన ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతుల్లో వెనుక కూర్చున్న బూర్గంపాడు మండలంలోని ఇరవెండికి చెందిన లకావత్ శాలిని ఎగిరి కింద పడటంతో వెనుక నుంచి వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఆమె తలపై నుంచి వెళ్లడంతో అమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్యామ్ గాయాలపాలయ్యాడు. ఈ ఘటనలో వారి కుమారులిద్దరు ఇప్పుడు తల్లి లేని పిల్లలయ్యారు. ఈ ఘటన జరిగిన మరికొద్ది రోజుల్లోనే మరో జంట ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి గాయాలపాలైంది. స్పందించాల్సిన పోలీస్, నేషనల్ హైవే అధికారులు స్పందించకపోవడంతో ప్రయాణికులే స్పందించి స్పీడ్ బ్రేకర్‌లకు ఆదివారం తెల్లవారుజామున పెయింటింగ్ వేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలను రక్షించాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

చలాన్లకే పరిమితం..!

భద్రాచలం పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యను సరిదిద్దాల్సిన పోలీసులు కేవలం చలాన్లకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసులు అదేపనిగా సెల్‌ఫోన్లతో ఫొటోలు తీస్తున్నారు. తమ ప్రధాన విధిని మరిచిపోతున్నారు. ప్రతి మంగళవారం కొత్త మార్కెట్ వద్ద సంత జరుగుతుంది. ఈ సమయంలో రోడ్లపైనే ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలుపుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమయాల్లో సైతం ట్రాఫిక్ సిబ్బందిని పూర్తిస్థాయిలో కేటాయించటం లేదు. అంబేడ్కర్‌సెంటర్, యూబీ రోడ్డులలో సైతం అదే పరిస్థితి నెలకొంటోంది. పాత మార్కెట్ సెంటర్‌లో ఉదయం 9 గంటల అనంతరం భారీ వాహనాలకు అనుమతి లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇరుకు సందుల్లో భారీ లారీలను, ట్రక్కులను నిలిపివేస్తుండటంతో వినియోగదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ట్రాఫిక్ సిబ్బంది ప్రధాన బాధ్యతలైన విధులను పక్కన పెట్టి చలాన్లపై దృష్టి పెట్టడం వలన అందరూ ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భద్రాచలం ఏఎస్పీ దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వంపై నమ్మకంతోనే సమ్మె విరమించాం



మాట్లాడుతున్న వంశీకృష్ణ

చుంచుపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నమ్మకంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె నుంచి వైదొలుగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తమ విషయంలో పునరాలోచన చేసి రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న సానుకూలంగా క్రమబద్ధీకరణ గురించి నిర్ణయం తీసుకోవాలన్నారు. 16 రోజులుగా సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపి పాల్గొన్న జేపీఎస్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరింత ఉత్సాహంతో గ్రామాలను అభివృద్ధిలోకి తీసుకురావడం కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమ్మె విరమించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరూ సోమవారం నుంచి విధుల్లో ఉంటారని, ప్రభుత్వానికి అన్నివిధాలా సహకరిస్తారని ఆయన వివరించారు. కాగా, జేపీఎస్ రెగ్యులరైజేషన్ సాధన కమిటీని ఏర్పాటు చేశామని, దానికి రాష్ట్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తానని, తమ సమస్యలను నేరుగా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వంశీకృష్ణ స్పష్టం చేశారు.

సమాజంలో అమ్మ పాత్ర గొప్పది

మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి



మాట్లాడుతున్న బాణోత్ చంద్రావతి



నృత్యం చేస్తున్న తల్లి, కూతురు

ఖమ్మంగాంధీచౌక్: సమాజంలో అమ్మ పాత్ర చాలా గొప్పదని టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు, వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోత్ చంద్రావతి అన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్‌లో శ్రీశ్రీశ్రీ హోటల్‌లో కార్తికేయ ఈవెంట్స్, హోటల్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రావతి మాట్లాడుతూ.. సమాజ, కుటుంబ ఉన్నతిలో తల్లి పాత్ర కీలకమన్నారు. కుటుంబాన్ని క్రమశిక్షణతో తల్లి నడిపించకగలిగితే ఆ కుటుంబం ఎంతో ఉన్నతంగా ఉంటుందని, ఆ కుటుంబానికి గ్రామాన్ని, సమాజాన్ని మార్చే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. అమ్మతనం చాలా గొప్పదని, సమాజం అంతా అమ్మతనాన్ని ఎంతగానో కీర్తిస్తుందని చెప్పారు. కని, పెంచి ప్రయోజకులను చేసిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత పిల్లలపై కూడా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్తికేయ ఈవెంట్స్ మేనేజర్ శోభారెడ్డి, శ్రీశ్రీశ్రీ హోటల్ నిర్వాహకురాలు తేజస్వి మాట్లాడుతూ.. మాతృ దినోత్సవాన్ని జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుల మాధవరెడ్డి ఆయన సతీమణి జ్ఞాపకార్థం కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు, మహిళలకు మెమెంటోలు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కీసర పద్మజారెడ్డి, అనితారెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ తప్ప.. ఆధారం లేదు..



నాచేపల్లిలో కృష్ణ నివాసం ఉంటున్న గుడారం



దివ్యాంగుడు కృష్ణ

నేలకొండపల్లి: ఆధార్ కార్డు తప్ప.. మరే ఆధారం లేని అభాగ్యుడు ఆయన. తెలిసిన వారు పెడితే తినటం.. దాతలు ఏర్పాటు చేసిన గుడారంలో జీవనం సాగించడం.. అతడి ప్రస్తుత స్థితి. నాలుగు నెలల కిందటి నుంచి ఆసరా పింఛన్ కోసం తిరుగుతున్నా ఇటు పాలకులు అటు అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన చిలకల కృష్ణ పలు కారణాలతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నాడు. ఆర్థిక స్థితి బాగాలేక సరైన సమయంలో తిండి లేక ఆరోగ్యంపై అశ్రద్ధ చూపటంతో నాలుగు నెలల కిందట అతడి కాలును తొలగించారు. అప్పటి నుంచి ఆసరా పింఛన్ కోసం నేలకొండపల్లి, ఖమ్మంకు పలుమార్లు తిరిగాడు. ఒంటి కాలుతో తిరగలేక ఆదరించే వారు లేక అన్నింటిపై ఆశలు వదులుకున్నాడు. స్థానికులు అంతా కలిసి ప్రభుత్వ స్థలంలో చిన్న గుడారం ఏర్పాటు చేయటంతో అందులోనే జీవనం సాగిస్తున్నారు. దివ్యాంగుడు కావటం, ఏపని చేయలేకపోవటం, చిల్లి గవ్వలేక తినేందుకు ఇబ్బందిపడుతున్నాడు. స్థానికులు దయతలిచి పెడితే కడుపు నింపుకుంటాడు. లేకుంటే పస్తులుంటాడు. ప్రస్తుతం ఆధార్ కార్డు తప్ప మరే ఇతర ఆధారం లేదని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

రైతులపై 'హమాలీ' భారం

- కొనుగోలు కేంద్రాలలో ఇష్టారాజ్యం
- క్వింటాకు రూ.100 హమాలీ చార్జీలు
- రైతులకు తడిసిమోపెడవుతున్న ఖర్చులు
- హమాలీ చార్జీల చెల్లింపులపై ప్రభుత్వం నిర్లక్ష్యం



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేస్తున్న హమాలీలు (ఫైల్)

బూర్గంపాడు: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా రైతు అవస్థలు పడుతున్నాడు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న హమాలీ చార్జీలతో రైతు కుదేలవుతున్నాడు. మద్దతు ధర కోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తే అక్కడ క్వింటాకు రూ.100 వరకు హమాలీ ఖర్చుల కోసం వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం క్వింటాకు రూ.2,060 మద్దతు ధర చెల్లిస్తుండగా ఇందులో క్వింటాకు రూ.100 వరకు హమాలీ చార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో రైతుకు మద్దతు ధర దక్కేపరిస్థితులు లేవు. వ్యవసాయ ఉత్పత్తులు ఎవరు కొనుగోలు చేసినా హమాలీ చార్జీలు వారే పెట్టుకుంటారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రం అందుకు విరుద్ధంగా రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. హమాలీ చార్జీల విషయంపై రైతులు గతంలో ఎన్నిసార్లు జిల్లా అధికారులను అడిగిన ముందుగా మీరు చెల్లిస్తే తరువాత ప్రభుత్వం మీ ఖాతాలలో జమచేస్తుందని చెబుతున్నారు. 2017 తరువాత ఇప్పటి వరకు హమాలీ చార్జీలకు సంబంధించి ఒక్కరూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఎప్పుడు అడిగినా ప్రభుత్వం ఇస్తే మీ ఖాతాల్లో జమవుతుందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్పుకుంటూ వస్తున్నారు. హమాలీ ఛార్జీల చెల్లింపులో ప్రభుత్వం చేతులేత్తెసినట్లేనని రైతులు చర్చించుకుంటున్నారు. హమాలీ ఛార్జీల విషయంలో ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక్కో విధంగా ఛార్జీలను వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా, మండల వ్యాప్తంగా ఒక రేటు నిర్ణయించకుండా రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా ధరలను పెంచుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో క్వింటా ధాన్యం కాంటా వేసి లారీలకు లోడింగ్ చేసినందుకు రూ 55 నుంచి రూ 65 వరకు వసూలు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో క్వింటాకు రూ 90 నుంచి రూ 100 వరకు వసూలు చేస్తున్నారు. ఎండల తీవ్రత, ఉపాధిహామీ పనుల పేరుతో రైతులపై అదనపు భారం మోపుతున్నారు.కొన్నిచోట్ల హమాలీల కొరతతో ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అకాల వర్షాలు, కొనుగోళ్లలో తీవ్రజాప్యం, మిల్లర్ల కోతలతో రైతులు హమాలీ ఛార్జీలు ఎంతైనా చెల్లించకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. క్వింటాకు రూ 100 వరకు హమాలీ ఛార్జీలు వసూలు చేస్తుండటంతో కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు నేరుగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే హమాలీ ఛార్జీలు వారే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ఇందుకు విరుద్ధంగా రైతులు చెల్లిస్తున్నారు.

2017కు ముందు ప్రభుత్వం క్వింటాకు రూ 5.30ల వరకు హమాలీ ఛార్జీలను చెల్లించింది. ముందుగా రైతులు హమాలీలకు ఛార్జీలు చెల్లిస్తే కొంత ఆలస్యంగానైనా ప్రభుత్వం రైతుల ఖాతాలలో హమాలీ ఛార్జీలు చెల్లించేది.అప్పుడు కూడా మూడువంతులు రైతులపై హమాలీ భారం పడేది. కనీసం పావువంతు అయినా రైతులకు ప్రభుత్వం నుంచి తిరిగి వచ్చేది. గత ఆరేళ్లుగా ప్రభుత్వం నుంచి రైతులకు రూపాయి బిళ్ల కూడా హమాలీ ఛార్జీలు రావటం లేదు. హమాలీ రేట్లు అన్ని కొనుగోలు కేంద్రాలలో ఒకేవిధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల అవసరాల బట్టి ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక్కో రేటు ఉండటంతో రైతులపై అదనపు భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు అన్ని సెంటర్లలో ఒకేవిధమైన హమాలీ రేటును నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని సెంటర్లలో అయితే రైతులే హమాలీలను ఏర్పాటు చేసుకుని వారు అడిగిన ధర చెల్లిస్తే తప్ప ధాన్యం కాంటాలు జరగనటువంటి పరిస్థితులున్నాయి. హమాలీ చార్జీల రూపంలో ప్రతి వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో రైతుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన హమాలీ చార్జీలు రైతులపై మోపడం సరికాదాని రైతుసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే హమాలీ ఖర్చులు చెల్లించాలని రైతులు, రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వమే హమాలీ చార్జీలు చెల్లించాలి



రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వమే హమాలీ చార్జీలు చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్వింటాకు రూ.2,060 మద్దతు ధర చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం హమాలీ చార్జీలు చెల్లించకుండా రైతులను ఇబ్బందులు పెడుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే హమాలీ చార్జీలు చెల్లించి రైతులపై ఎలాంటి భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఏనుగుల వెంకటరెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

హమాలీ చార్జీలు రైతులే చెల్లిస్తున్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం హమాలీ చార్జీలు రైతులే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుంచి గతంలో హమాలీ చార్జీలు కొంతమేర వచ్చాయి. ప్రస్తుతం హమాలీ చార్జీల విషయం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. స్థానిక అవసరాలను బట్టి హమాలీ చార్జీల్లో హెచ్చుతగ్గులున్నాయి.

– త్రినాథ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో.. సహాయక చర్యల్లో పోలీసులు

దూసుకొచ్చిన మృత్యువు

- మరో ఆరుగురికి గాయాలు
- కాకినాడ జిల్లాలో అతివేగంగా ఆటోను ఢీకొన్న బస్సు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోరంగి పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 13 మంది మహిళలు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని ఎపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. ఉదయం షిఫ్ట్ పని పూర్తిచేసుకుని మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తిరిగి అదే ఆటోలో ఇళ్లకు బయలుదేరారు. ఆటో బయలుదేరిన పదినిమిషాల్లోనే.. మరో 20 నిమిషాల్లో ఇళ్లకు చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ఎపెక్స్ కంపెనీ నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న సుబ్బారాయుని దిబ్బ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న మోజో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొంది. అత్యంత వేగంగా ఆటోను ఢీకొన్న బస్సు పక్కనున్న రైలింగ్‌ను ఢీకొని ఆటోను సుమారు 20 మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. బస్సు ఢీకొన్న తాకిడికి ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందింది. యానాం ఫరంపేటకు చెందిన ఆటోడ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని ముందే గుర్తించి ఆటోలో నుంచి దూకేసి ప్రాణాలు దక్కించుకున్నాడు.

ఇచ్చిపుచ్చుకున్నారు..

అమరావతి కేంద్రంగా చంద్రబాబు క్విడ్ ప్రో కో గుట్టురట్టు


సాక్షి, అమరావతి: కృష్ణా నది కరకట్టపై చంద్రబాబు నివాసం.. అమరావతిలో చంద్రబాబు క్విడ్ ప్రో కోకు ఓ మచ్చు తునకని నిగ్గు తేలింది. అమరావతిలోని సీడ్ క్యాపిటల్‌లో నారాయణ బినామీల పేరిట ఉన్న 75,888 చదరపు గజాల స్థలాలు టీడీపీ భూబాగోతానికి నిదర్శనమని నిర్ధారణ అయ్యింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో టీడీపీ పెద్దల అవినీతి బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే చంద్రబాబు, నారాయణ, లింగమనేని, వారి బంధువులు, బినా మీలు భారీ భూ దోపిడీకి బరితెగించారని ఆధారాలతో సహా వెల్లడైంది. చంద్రబాబు అండ్ గ్యాంగ్ అమరావతిలోని అవినీతి సామ్రాజ్యాన్ని సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బట్టబయలు చేసింది. దాంతో టీడీపీ ప్రభుత్వంలో అమరావతి కేంద్ర బిందువుగా ఏ–1 నారా చంద్రబాబు, ఏ–2 పొంగూరు నారాయణ యథేచ్ఛగా సాగించిన భారీ భూ దోపిడీపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం పాల్పడిన అక్రమాలు, అవినీతిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించడం సరైనదేనని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో తన అవినీతి బట్టబయలు కాకుండా బాబు కొన్నేళ్లుగా అడ్డుకుంటున్న కుట్రలకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాజధాని ల్యాండ్ పూలింగ్, సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లలో పచ్చ ముఠా అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

■ బాబు, నారాయణవి అక్రమ ఆస్తులే

అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులను అటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్న క్రిమినల్ లా ఆర్డినెన్స్ ప్రకారం అనుమతించాలని సీఐడీ కోరింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం –1988 ప్రకారం లింగమనేని కుటుంబం క్విడ్ ప్రో కో కింద చంద్రబాబుకు ఇచ్చిన కరకట్ట నివాసం.. సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో నారాయణ బినామీల పేరిట పొందిన 75,888 చదరపు గజాల స్థలాలను అటాచ్ చేసేందుకుసీఐడీకి అనుమతిస్తూ హోమ్ శాఖ రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. దాంతో సీఐడీ ఆ విషయాన్ని ఏసీబీ న్యాయస్థానానికి నివేదించి, ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు ఉపక్రమించనుంది. తదుపరి దశల్లో మరిన్ని కఠిన చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేస్తోంది.

■ భారీ అవినీతికే 'మాస్టర్ ప్లాన్'

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 బాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పునాది వేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే అప్పటి టీడీపీ ప్రభుత్వం, సింగపూర్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజస్‌తో ఒప్పందం చేసుకుంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెన్సీ ఎంపిక కోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకుండా సింగపూర్ కంపెనీకి నామినేషన్ పద్ధతిలో అడ్డగోలుగా అప్పగించేశారు. దాంతో చంద్రబాబు, నారాయణ కనుసన్నల్లోనే మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ కంపెనీ రూపొందించింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది.



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌లో అక్రమాలను నిరూపిస్తున్న మ్యాప్

■ క్విడ్ ప్రో కో కిందే కరకట్ట నివాసం

చంద్రబాబు, లింగమనేని క్విడ్ ప్రో కో కింద పరస్పరం భారీగా అవినీతికి పాల్పడినట్టు సిట్ నిర్ధారించింది. లింగమనేని కుటుంబ సభ్యుల భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా చేసినందుకు బాబుకు భారీగా ముట్టజెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు' ఇవ్వడంతో సరిపెట్ట లేదు. లింగమనేని కృష్ణానది కరకట్ట మీద ఉన్నని వాసాన్ని కూడా బాబుకు ఇవ్వడం గమనార్హం. పక్కా క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసం బాబుకు ఉచితంగా ఇచ్చేశారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

■ కరకట్ట నివాసంపై బాబు కట్టుకథలు

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతోపాటు హౌస్ రెంట్ అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. అంటే ప్రజాధనం నుంచి సీఎంగా ఇంటి అద్దె అలవెన్స్ తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి అద్దెను లింగమనేని కుటుంబానికి చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. అంటే ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రజాధనం నుంచి తీసుకుంటున్న చంద్రబాబు.. తాను నివసిస్తున్న ఇంటికి మాత్రం అద్దె చెల్లించడమే లేదన్నది నిర్ధారణ అయ్యింది. క్విడ్ ప్రో కోలో భాగంగా ఆ నివాసం చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారు కాబట్టే అద్దె చెల్లించలేదు.

■ దేశ భక్తితో ఇచ్చారట!

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని లింగమనేని రమేశ్ న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. మరి ఉచితంగా ఇచ్చిన ఇంటికి చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎలా తీసుకున్నారన్న ప్రశ్నకు సమాధానమే లేదు. దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేయాలి. ఆ ఇంటిని ప్రభుత్వానికి అప్పగించాలి. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలి. ఆ నివాసం ప్రభుత్వానికి చెందుతుంది. కానీ 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కోలో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది దీనినిబట్టి కూడా నిర్ధారణ అయ్యింది.

■ లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాలను 'కొనుగోలు చేసినట్టు' చూపించడం గమనార్హం. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసింది. ఆ పేరుతో ఆ భూమిని హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ మేరకు అప్పట్లోనే నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై, మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

- అమరావతిలో అత్యంత ప్రధానమైన సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఎందుకంటే శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మించాలని నిర్ణయించారు.
- ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి కాబట్టి, సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా చంద్రబాబు, నారాయణ పన్నాగం పన్నారు. సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించింది. కానీ ఆ ప్లాన్‌ను బహిర్గతం చేయకుండా, ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు.
- ఆ సమయంలోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు.
- రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు.
- కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు.
- అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. వాటిలో 7,620 చదరపు గజాలు, 8,880 చదరపు గజాలు, 6,550 చదరపు గజాలు, 25 వేల చదరపు గజాల స్థలాలు కూడా ఉన్నాయి. అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం.
- భవిష్యత్‌లో స్టార్ హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇతర భారీ వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలమైన విలువైన స్థలాలను పొందారన్నది స్పష్టమవుతోంది. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ. 1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమచేస్తున్నారు. అంటే ఆ భూములు కొను గోలు చేసి సీఆర్‌డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్‌కుమార్ కొత్తప్ప పూర్తిగా నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల వద్దే ఇన్నర్ రింగ్ రోడ్డు

- అమరావతిలో 75 మీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించడంలో చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వారి భూములను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. తమ భూముల నుంచి కాకుండా సామాన్య రైతుల భూముల నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం గమనార్హం. అందుకోసం ముందుగానే ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వకుండా సీఆర్‌డీయే నిలుపుదల చేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. అప్పటికే నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకే ఓ కన్సల్టెన్సీని నియమించి కనికట్టు చేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆస్పత్రి వద్ద ఉన్న తాడిగడప-ఎన్కేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్‌టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల మీదుగా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్‌డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్‌డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు- నిడమనూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు.

జిల్లా వార్తలు


అంతర్జాతీయ క్రీడాకారిణికి అండగా ఉంటాం

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు


లహరితో మాట్లాడుతున్న గడల శ్రీనివాసరావు

పాల్వంచ: ఈనెల 22 నుంచి 25 వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన నూనావత్ లహరికి ఆర్థికంగా అండగా ఉంటామని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, జీఎస్టార్ ట్రస్ట్ చైర్మన్ గడల శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక కేటీపీఎస్ కాలనీలో తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.రామారావు నివాసానికి గడల వచ్చారు. ఈ సందర్భంగా లహరి, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావును కలిసి సహాయం చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. పోటీలకు హాజరయ్యేందుకు అయ్యే మొత్తం ఖర్చును జీఎస్టార్ ట్రస్ట్ నుంచి భరిస్తామని భరోసా ఇచ్చారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


రిజర్వాయర్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన సందర్శకులు కిన్నెరసాని ప్రకృతి అందాలను వీక్షించి ముగ్ధులయ్యారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటు షికారు చేశారు. 796 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,085 ఆదాయం లభించింది. 500 మంది బోటింగ్ చేయడం ద్వారా రూ.25,280 ఆదాయం టూరిజం శాఖకు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నిబంధనలతో రైతుల ఉక్కిరిబిక్కిరి

- మొక్కజొన్న క్రాప్ బుకింగ్ ఆధారంగా కూపన్ల పంపిణీ
- యాసంగిలో దిగుబడి తక్కువగా చూపిస్తున్న వైనం
- కొనుగోలు కేంద్రాల్లో అనుమతి దక్కని కౌలు రైతులు



కొమరారంలో తేమ తగ్గేందుకు ఆరబెట్టిన మొక్కజొన్న (ఇన్‌సెట్) మొక్కజొన్న తూర్పారపడుతున్న రైతు

ఇల్లెందురూరల్: ప్రస్తుత యాసంగిలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టోయారు. అతివృష్టి, అనావృష్టిని అధిగమించి ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకుందామనుకుంటే అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. సగానికి పైగా పంట దళారులకు అమ్ముకున్నాక మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికే పరిమితం కాగా.. వారం తర్వాత మరికొన్ని చోట్ల కొనుగోళ్లు చేపట్టారు. అయితే, పంట కొనుగోలు చేసే క్రమాన మార్క్‌ఫెడ్ అధికారులు విధించిన నిబంధనలు రైతులకు శాపంగా మారాయి.

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 35వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 80వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇల్లెందు మండలంలో 12,400 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగైంది. ఇదిలా ఉండగా భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 30వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెపుతున్నాయి.

ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు

సాధారణంగా యాసంగిలో మొక్కజొన్న పంట మార్చి చివరి వారం నుంచే రైతుల చేతికందుతుంది. ఈ ఏడాది అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఏప్రిల్ రెండో వారం నుంచి మార్కెట్ మొక్కజొన్న విక్రయాలు ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు ముందుగానే మద్దతు ధర కంటే తక్కువకే దళారులకు విక్రయించారు. ఆ తర్వాత ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ప్రకటించడంతో మిగిలిన పంటకైనా మద్దతు ధర వస్తుందని రైతులు ఆనందపడ్డారు. కానీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన వారానికి కానీ కొనుగోళ్లు మొదలుకాలేదు.

నిబంధనల కొర్రీ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న విక్రయించేందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. సాధారణంగా వానాకాలంలో మొక్కజొన్న ఎకరానికి 25 క్వింటాళ్లు, యాసంగిలో 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ అధికారులు మాత్రం ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. అంతేకాక పట్టాభూమి కలిగిన రైతుల నుంచే తీసుకుంటామని చెబుతుండడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే, ఎక్కువ మొత్తం విస్తీర్ణంలో సాగు చేసే రైతులు మిగిలిన పంటను తక్కువ ధరకే దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మిగిలిన పంట ఎవరికి విక్రయించాలి



నాలుగు ఎకరాల పట్టా భూమిలో మొక్కజొన్న సాగు చేశా. కూపన్ కోసం వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్తే రెండెకరాలకే ఇచ్చారు. మిగతా రెండు ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసినట్లుగా నమోదైందని చెప్పారు. మొత్తంగా 50 క్వింటాళ్లే కొనుగోలు చేస్తే మిగతా పంటను ఎవరికి విక్రయించాలో తెలియడం లేదు. **– అజ్మీరా సక్రాం, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం**

కౌలు రైతుల పంట కొనరట..



పూర్వీకుల నుంచి రెండెకరాలు సంక్రమించింది. గిరిజనేతరులం కావడంతో భూమికి పట్టా లేదు. దీనికి తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాను. పంట తీసుకుని కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్తే కౌలు రైతుల నుంచి కొనుగోలు చేయమని చెబుతున్నారు. **– మంచె శ్రీను, కౌలు రైతు, కొమరారం, ఇల్లెందు మండలం**

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం



మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి రూపొందించిన నిబంధనలు సడలించాలని విన్నపాలు వచ్చాయి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం. పంట దిగుబడి ఆధారంగా కొనుగోళ్లు చేయడంతో పాటు పట్టా లేని రైతుల నుంచి పంట కొనుగోలు చేసేలా అనుమతి కోరతాం. **– సునీత, మార్క్‌ఫెడ్, జిల్లా మేనేజర్, ఉమ్మడి ఖమ్మం**

మిగిలింది ఆరు నెలలే..

- వచ్చే ఎన్నికలకు అంతా సిద్ధం కావాలి
- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలూ బీఆర్ఎస్ ఖాతాలోకే
- ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ నామా, విప్ రేగా కాంతారావు


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

టేకులపల్లి: రాష్ట్రంలో డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఈ ఆరు నెలల పాటు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాద్రి జిల్లా టేకులపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆరే మూడోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో ఎవరి మధ్య అయినా చిన్న చిన్న అపోహలు ఉంటే సర్దుకుపోయి ఐక్యంగా పని చేయాలన్నారు. గత 75 ఏళ్లలో ఎవరూ చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలోనే చేసి చూపించారని చెప్పారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యేగా తిరిగి హరిప్రియను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న అంతరాలు, మనస్పర్థలను తొలగించి వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో గులాబీ జండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజలు అభివృద్ధిని చూస్తున్నారని, వారంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ.. తనను అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు బురద జల్లుతున్నారని, ప్రజాక్షేత్రంలో వారికి గుణపాఠం చెబుతామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని, ఇక్కడ బీఆర్‌ఎస్ నుంచి ఓడిన వ్యక్తిని జెడ్పీ చైర్మన్‌ను చేస్తే.. సొంత ప్రయోజనాల కోసం ఇప్పుడు పార్టీని వీడారని కోరం కనకయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీ భూక్యా రాధ, బానోత్ హరిసింగ్‌నాయక్, పులిగళ్ల మాధవ్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, రంగనాథ్, కిషన్, రామ, నరేష్, బి.శివకృష్ణ, పాపా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

నేడు 'పేట'లో ఇద్దరు మంత్రుల పర్యటన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖ మంత్రులు నిరంజన్ రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం అశ్వారావుపేటలో పర్యటించనున్నారు. స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో నూతనంగా నిర్మించిన బాలికల హాస్టల్ భవనాలను రాత్రి 7 గంటలకు వారు ప్రారంభిస్తారు.

మంత్రులతో పాటు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

కబడ్డీ విజేత 'భద్రాద్రి కొత్తగూడెం'

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్ : నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ముగిశాయి. పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు ప్రథమ స్థానం దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో ఖమ్మం జిల్లా జట్టు నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి హాజరై విజేతలను అభినందించారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుళ్లూరి శ్రీనివాస్, నగర అధ్యక్షులు నల్లమల రంజిత్, ఎండీ. మతిన్, పారుపల్లి సురేష్, కృష్ణఫర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ స్థానంలో నిలిచిన భద్రాద్రి జట్టుకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

మాతృమూర్తికి పాదపూజ

తల్లికి పాదపూజ చేసి ప్రేమానురాగాలు చాటుకున్నారు పాల్వంచలోని మార్కెట్ ఏరియాలో గల దోగిపర్తి సత్యలక్ష్మి కుటుంబసభ్యులు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా సత్యలక్ష్మికి ఆమె కుమారులు, కూతుర్లు, ఇతర కుటుంబసభ్యులు దోగిపర్తి శ్రీనివాస్, సతీశ్, నగేశ్, చలవాది రాజ్యలక్ష్మి, రమాదేవి, కృష్ణవేణి, దోగిపర్తి శ్వేత, బచ్చు శ్రీనివాస్, సువర్ణ, రూప పాద పూజ చేసి, ఘనంగా సన్మానించారు. - పాల్వంచ


సత్యలక్ష్మికి పాదపూజ చేస్తున్న కుటుంబ సభ్యులు